www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 18 అక్టోబర్ 2024
5
కాకినాడ



20న సిపిఎం మండల మహాసభ

ప్రజాశక్తి - తాళ్లరేవు రూరల్

సిపిఎం మండల మహాసభ ఈనెల 20న స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు తెలిపారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన మూడేళ్ల కాలంలో ప్రజా ఉద్యమాలను సమీక్షించుకుని, రాబోవు మూడేళ్ల కాలంలో చేపట్టే ప్రజా ఉద్యమాలకు కార్యచరణను రూపొందిస్తామని తెలిపారు. అనంతరం పార్టీ నూతన మండల కమిటీని ఎంపిక చేసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు వల్లు రాజబాబు, దుప్పి అదృష్టదీపుడు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వెల్‌నెస్ సెంటర్లు

- అరకొర సిబ్బందితో వైద్య సేవలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - కోటనందూరు

ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంతో గత వైసిపి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్ఆర్ వెల్‌నెస్ సెంటర్ల పేరుతో ఆరోగ్య కేంద్రాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకు అవసరమైన నిధులను వెచ్చించిన ప్రభుత్వం ఆగమేఘాలపై నిర్మాణాలను చేపట్టింది. కొన్ని నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని కేంద్రాలు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని పూర్తయిన కేంద్రాల్లో ప్రాథమిక వైద్య సేవలందించేందుకు వీలుగా కొంతమంది సిబ్బందిని నియమించింది. ప్రస్తుతం ఆయా కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.

మండలంలో 17 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 14 పంచాయతీల్లో వెల్‌నెస్ సెంటర్లు నిర్మించేందుకు అధికార యంత్రాంగం ప్రణాళికను సిద్ధం చేసింది. వీటి నిర్మాణానికి రూ.2.27 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. నిర్మాణం చేసే ఒక్కొక్క వెల్‌నెస్ సెంటర్‌కు రూ.17.50 లక్షల చొప్పున నిధులు మంజూరు అయ్యాయని పంచాయతీరాజ్ శాఖ మండల ఇన్‌ఛార్జ్ జెఇ శివాజీరావు తెలిపారు. అల్లిపూడి, బిహెచ్.కోట, ఇందుకపల్లి, జగన్నాథపురం, కెవి.మల్లవరం, కెఇ.చిన్నయపాలెం, లక్ష్మీదేవిపేట, కోటనందూరు, పి.కొట్టం, బొద్దవరం గ్రామాలలో వీటి నిర్మాణాలను మొదటి దశలో ప్రారంభించారు. వీటిలో కొన్ని నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా చేసిన పనులకు బిల్లులు పూర్తి స్థాయిలో చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఎక్కడ పనులు అక్కడే నిలిపివేశారు. అయితే కోటనందూరు, కెవి.మల్లవరం, అల్లిపూడి, కెఇ.చిన్నయపాలెం, జగన్నాథపురం గ్రామాల్లో చేపట్టిన ఈ సెంటర్లలో పనులు 80 శాతం వరకూ పూర్తియ్యాయని ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ వెల్లడించారు. వీటిలో ఎస్ఆర్.పేట, కె.కొట్టాం, కాకరపల్లి, ఎల్‌డి.పేట, బొద్దవరం గ్రామాల్లో నిర్మాణాలు పూర్తియ్యాయి. అయితే బిహెచ్.కోట సెంటర్ మాత్రం నేటికీ పునాదుల్లోనే దర్శనం ఇస్తుంది. దీనికి ప్రధాన కారణం చేసిన పనులకు నిధులు విడుదల చేయకపోవడమే అంటున్నారు. బొద్దవరంలో విలేజ్ క్లినిక్ ప్రారంభించగా వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయి. అయితే పాతకొట్టం, అల్లిపూడి సెంటర్లు పూర్తికాకపోవడంతో వాటి స్థానంలో చేయాల్సిన వైద్యసేవలను ఆ పక్కనే ఉన్న గ్రామ సచివాలయాల్లో వైద్య సేవలను అందిస్తున్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయి వైద్య సిబ్బంది, వైద్య పరికరాలు లేకపోవడం వల్ల మండల కేంద్రాల్లో ఉన్న ఆసుపత్రికి రోగులను తరలిస్తున్నారు. దీంతో గ్రామ ప్రజలు స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యులనే ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు వైద్యులు రక్త పరీక్షలు ఇతర టెస్టుల పేరుతో గ్రామీణ ప్రజలను దోచుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు జిల్లా వైద్య శాఖ అధికారులు స్పందించి వెల్‌నెస్ సెంటర్లో భవనాలను పూర్తి చేసి పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని, వైద్య పరికరాలను ఏర్పాటుచేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.



ఎల్‌డి.పేటలో నిరుపయోగంగా ఉన్న వెల్‌నెస్ సెంటర్

8 నుంచి 15 వరకూ ప్రజాపోరు

జయప్రదానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

నవంబర్ 8 నుంచి 15 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు కార్యక్రమాన్ని సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడలోని సుందరయ్యభవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న పారిశ్రామిక విధానాలపై కార్మిక సంఘాలతో సమగ్రంగా చర్చించాలని, తర్వాతే తుది రూపం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పారిశ్రామిక విధానం దివాలాకోరు విధానం అని ఎద్దేవా చేశారు. ముందుగా వ్యవసాయ విధానాన్ని పెట్టాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రగతే లక్ష్యం అంటూ ఆరు కొత్త పాలసీలను ప్రకటించిందన్నారు. ఇందులో భాగంగా 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిందన్నారు. ఇంత వరకూ ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో చెప్పాలన్నారు. డిఎస్‌సిపై సంతకం చేశామని చెప్పుకోవడం మినహా నాలుగు నెలలుగా దీని ఊసే ఎత్తలేదన్నారు. డిఎస్‌సి ఎప్పుడు పెడతారనేదానిపై స్పష్టత కరువైందన్నారు. అభ్యర్థులు కోచింగ్‌లు తీసుకుని ఎదురు చూస్తున్నారన్నారు. ఎపిపిఎస్‌సికి చైర్మన్ కూడా లేరన్నారు. 20 లక్షల ఉద్యోగాలని భ్రమలు పెట్టి జనాలను మోసం చేయడం తప్ప ఇంకొకటి కాదన్నారు.

కాకినాడలోనే 2008లో 10 వేల ఎకరాలతో సెజ్ ప్రారంభించారన్నారు. పుష్కరకాలం దాటినా నేటికీ పరిశ్రమలు రాలేదన్నారు. ఇప్పటివరకు అక్కడ ఎన్ని పరిశ్రమలు పెట్టారు? ఎంతమందికి ఉపాధి లభించిందనేది ప్రభుత్వం తేల్చి చెప్పాలన్నారు. పారిశ్రామిక వేత్తలను సృష్టిస్తామని చెప్పిన ఆలోచన మంచిదే అయినప్పటికీ మరి వ్యవసాయం ఉత్పత్తి సంగతి ఏంటని ప్రశ్నించారు. అన్నపూర్ణగా పేరు ఉన్న ఎపిని ఆకలిరాజ్యంగా మార్చేస్తారా? అని ప్రశ్నించారు. నేడు వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. రాష్ట్రంలోనే పారిశ్రామికవేత్తలు రూ.లక్ష కోట్లు ఎగ్గొట్టారన్నారు. దమ్ముంటే అవన్నీ ముక్కు పిండి వసూలు చేయాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. గతంలో జగన్ మోడీ జపాన్ని చంద్రబాబు అందుకున్నారని విమర్శించారు. మోడీ చేతిలో కీలుబొమ్మలా మారారన్నారు. విభజన తర్వాత పదేళ్లలో రెండు ప్రభుత్వాలు మారాయని, ఈ కాలంలో ఎంతమందికి ఉపాధి కల్పించారు అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలను భ్రమల్లో పెట్టి మోసం చేయడం తగదని ప్రభుత్వానికి హితవు పలికారు. బడా పారిశ్రామికవేత్తలకు అడ్డుగోలు భూ పంపిణీ కార్యక్రమాలను నిలుపుదల చేయాలన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాకుండా ఈజ్ ఆఫ్ వెల్ఫేర్, కార్మికులకు కనీస వేతనం, వారి భద్రత సంక్షేమాలను పట్టించుకోవాలన్నారు. కాకినాడ సెజ్‌లో చంద్రబాబు మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని చెప్పారని, కాని చేయలేదన్నారు. ఇప్పుడైనా హామీని అమలు చేయాలన్నారు. సెజ్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేయాలి లేదా తిరిగి రైతులకు భూములైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లాలో 10 వేల మంది మత్యకారులకు నేటికీ వేట నిషేధ పరిహారం అందలేదన్నారు. తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. తుపానుల సమయంలోనూ వేట నిషేధ పరిహారాన్ని ఇవ్వాలన్నారు. కాకినాడ జిల్లాలో ఏలేరు ఆధునికీకరణను తక్షణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



ప్రజాపోరును జయప్రదం చేయాలి

ప్రజాసమస్యలపై నవంబర్ 8 నుంచి 15వ తేదీ వరకు ప్రజాపోరు పేరుతో వారం రోజులు పాటు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలను చేపట్టనున్నామన్నారు. వీటిని విజయవంతం చేయాలన్నారు. అలాగే ట్రూఅప్ ఛార్జీల పేరుతో చట్టాలకు వ్యతిరేకంగా ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపుతున్నారన్నారు. వీటిని రద్దు చేయాలని ఈనెల 18న విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా చేపడుతున్నామన్నారు. నూతన మద్యం పాలసీ వల్ల రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేని చోట్ల షాపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు, కాకినాడ జిల్లా సిపిఎం కన్వీనర్ ఎం.రాజశేఖర్, నాయకులు దువ్వా శేషబాబ్జి, కెఎస్.శ్రీనివాస్, కరణం ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆదిత్యలో 6 రోజుల కార్యశాల ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల హ్యుమానిటీస్ అండ్ బేసిక్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 6 రోజుల కార్యశాల గురువారం ప్రారంభం అయింది. 'మోటివేషనల్ వర్క్‌షాప్ ఆన్ ఫెయిల్యూర్ ఈజ్ నాట్ యువర్ డ్రీమ్ ఫర్ అకాడమిక్ అండ్ కెరీర్ డెవలప్‌మెంట్' అనే అంశంపై కార్యశాల మంగళ వారం వరకూ జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బెంగుళూరుకు చెందిన డాక్టర్ జగన్నాథరావు స్కిల్ అండ్ విల్ డెవలప్‌మెంట్ అధిపతి డాక్టర్ జగన్నాథరావు నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌లో హౌ ది స్టూడెంట్స్ విల్ ఎన్ హెన్స్ థేయిర్ పర్సనల్ గ్రోత్, కెరీర్ స్కిల్స్, మోటివేషన్, అండ్ గోల్ అచీవ్‌మెంట్ స్ట్రాటజీస్ వస్ అనే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ డాక్టర్ పి.రవికుమార్, డీన్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ వైకెఎస్. సుబ్బారావు, డీన్ కెరీర్ గైడెన్స్ డాక్టర్ ఎన్.కిషోర్, డీన్ ఐక్యూ ఎసి డాక్టర్ జి.సంజీవరావు, విభాగాధి పతి డాక్టర్ సి.రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న జగన్నాథరావు

జీవ ఎరువులతో అధిక లాభాలు

ప్రజాశక్తి - కాజులూరు

జీవ ఎరువులు వినియోగంతో అధిక లాభాలు పొందవచ్చునని వ్యవసాయ శాఖ జెడీ ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని శీల గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో ఎరువులు, పురుగుమందులను తగ్గించి సహజ సిద్ధమయిన జీవణ ఎరువులు, కషాయాలతో నాణ్యమైన పంటను పండించాలని సూచించారు. ఈ విధంగా పండించిన పంటను రైతులు సంఘాలుగా ఏర్పడి తమ పండించిన పంటకు మంచి ధరలు వచ్చేలా రైతు ఉత్పాదక సంఘం (ఎఫ్‌పిఒ)తో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయంలో లాభసాటిగా మార్చేందుకు కొత్త కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోమలి వెంకటరమణ, వ్యవసాయ శాఖ ఎడిఎ కె.బాబురావు, మండల వ్యవసాయ అధికారి వి.అశోక్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ జెడీ



ఎంబివికె బృందానికి వివరిస్తున్న శ్రీనివాస్

సైన్స్ సెంటర్‌ను సందర్శించిన ఎంబివికె బృందం

ప్రజాశక్తి - పెద్దాపురం

అల్లం రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిటి సైన్స్ సెంటర్‌ను గురువారం మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఛైర్మన్ పి.మధు, కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు సైన్స్ సెంటర్ ద్వారా విద్యార్థులకు ప్రయోగాలపై శిక్షణ ఇచ్చే విధానాలు, సైన్స్ ప్రయోగాలు, ఇక్కడ ఉన్న రకరకాల పరికరాలను పరిశీలించారు. సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ సైన్స్ సెంటర్ స్థాపించిన నాటి నుంచి చేపట్టిన సైన్సు ప్రయోగాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంబివికె ఛైర్మన్ పి.మధు మాట్లాడుతూ విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి కేంద్రాలుగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సైన్స్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైన్స్ సెంటర్ సహాయకులు సునీత, దారపురెడ్డి కృష్ణ, మహాపాతిన రాంబాబు పాల్గొన్నారు.

కట్టమూరులో అన్నదానం

పెద్దాపురం: మండలంలోని కట్టమూరు గ్రామంలో గురువారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కెవివి.నగేష్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ యాజమాన్య ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. మున్సిపల్ హైస్కూల్లో తగినంతమంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జిటి, పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. మున్సిపల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులలో అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలన్నారు. మున్సిపల్ హెచ్‌ఎంలలో అర్హులైన వారికి అర్బన్ ఎంఇఒలుగా నియమించాలని కోరారు. మున్సిపల్ టీచర్లకు జిపిఎఫ్ ఖాతాలు తెరవాలన్నారు. మున్సిపల్ టీచర్ల బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. మున్సిపల్ పాఠశాలలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగేష్, చక్రవర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సబ్ కమిటీ కన్వీనర్ వజ్రపు మహేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవి.సాయిరాం, జిల్లా ట్రెజరర్ పివిఎన్.గణేష్, జిల్లా కార్యదర్శులు పెద్దిరాజు, పి.గిరిధర గోపాల్‌రావు, పి.రాజబాబు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లా డుతున్న ఎంఎల్‌సి వెంకటేశ్వరరావు

పల్లె పండుగలో శంకుస్థాపనలు

జిల్లాలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్‌ఎలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

గండేపల్లి మండలంలో తాళ్లూరు, నీలాద్రి రావుపేట, జెడ్.రాగంపేట, పి.నాయకంపల్లి, యల్లమిల్లి గ్రామాల్లో పల్లె పండగ కార్యమాల్లో ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. నీలాద్రి రావు పేటలో పద్మ ఇండస్ట్రీస్ అధినేత కంచర్ల శ్రీనివాస్ ఆర్ఒ ప్లాంట్ మరమ్మతుల కోసం రూ.2 లక్షలను విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా దాతను ఎంఎల్‌ఎ నెహ్రూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోర్పు లచ్చయ్య దొర, ఎస్‌విఎస్.అప్పలరాజు, పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, పరిమి బాబు, కందుల బాబ్జి, కోర్పు సాయితేజ, జాస్తి వసంత్, ఎంపిడిఒ నాతి బుజ్జి, తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని కాండ్రకోట, గోరంట్ల, వడ్డమూరు గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, మరలోవ సర్పంచ్ తోట రామకృష్ణ, ఎంపిడిఒ శ్రీలలిత, తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఇఒపిఆర్‌డి రమణ, ఉపాధి హామీ పథకం పీడీ అడపా వెంకటలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు కొత్తిం వెంకటశ్రీనివాసరావు, గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని పాల్గొన్నారు. **తాళ్లరేవు రూరల్** మండలంలోని ఇంజరంలో రూ.30 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లకు ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ముద్దన వెంకటశివరామప్రసాద్ పంచాయతీలో ఉన్న సమస్యలను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కోరుకొండ కిరణకుమారి, వేగేశ్న భాస్కరరాజు, శ్రీను రాజు, ఆకెళ్ళ నాగేశ్వరరావు, కాట్రు వీరేశ్వరరావు, మోర్త భైరవమూర్తి పాల్గొన్నారు. **శంఖవరం** మండలంలోని గౌరింపేట, గొంది కొత్తపల్లి, శంఖవరం, కత్తిపూడి, వజ్రకోటం, సీతంపేట గ్రామాల్లో సుమారు కోటి రూపాయలు వ్యయంతో సిసి రోడ్లు నిర్మాణాలకు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శర్మ, ఆయా గ్రామాల సర్పంచులు, టిడిపి నాయకులు పర్వత సురేష్, బద్ది రామారావు, వెన్నా శివ, కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



మున్సిపల్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - సామర్లకోట

ఎస్‌సిలు అధికంగా నివసించే ప్రాంతంలో సెప్టిక్ వ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ ఎస్‌సి సామాజికవర్గానికి చెందిన ప్రజలు గురువారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. వీరికి ఎస్‌సిలకు చెందిన కౌన్సిలర్లు నేతల హరిబాబు, పాలిక కుసుమ, మర్రి శేషారావు మద్దతు తెలిపారు. కార్యాలయ ముట్టడి సందర్భంగా కమిషనర్ శ్రీవిద్య ఆందోళనకారులతో చర్చలు నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర పథకం ద్వారా ప్లాంట్ ఏర్పాటుకు కౌన్సిల్ తీర్మానం జరిగిందన్నారు. దాని ఆధారంగానే చర్యలు చేపడుతున్నట్టు ఆమె చెప్పారు. అయితే ఈ ప్లాంట్ ఏర్పాటుకు సంభందించి ప్రజాభిప్రాయ సేకరణ ఎందుకు చేపట్టలేదని దళిత సంఘాల నాయకులు నిలదీశారు. కమిషనర్ మాట్లాడుతూ తమకు అవసరమైన స్థలం కేవలం 50 సెంట్లు మాత్రమేన, ఈ ప్లాంట్ వల్ల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగదని వివరించారు. అయినా ఆందోళకారులు ముట్టడిని కొనసాగించడంతో ప్రజాప్రతినిధులు, కౌన్సిల్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ప్రజలు ఆందోళనను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మానవహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ తమ ప్రాంతంలో సెప్టిక్ వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేయవద్దని బుధవారం నాడు కమిషనర్‌కు వినతిపత్రం అందించామని అన్నారు. అయితే గురువారం మున్సిపల్ సిబ్బంది స్థల పరిశీలన చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. కౌన్సిలర్ నేతల హరిబాబు మాట్లాడుతూ ఇప్పటికే మురికి వాడలుగా ఉన్న ఎస్‌సి పేటలను పట్టణంలో ఉన్న మురికి అంతటిని తీసుకువచ్చి మరింత మురికి వాడగా మార్చడాన్ని సహించమని అన్నారు. ఈ ఆందోళనలో దళిత సంఘాల నాయకులు పి.ప్రసాద్, జి.సత్యనారాయణ, ఎన్.అప్పారావు, బి.సత్యనారాయణ, కుమార్, సంజయ్ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న దళితులు



వైసిపి అధినే జగన్‌ను సత్కరిస్తున్న ముదునూరి మురళీకృష్ణరాజు

వైసిపిలోకి ముదునూరి మురళీకృష్ణరాజు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజక వర్గా నికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి ముదు నూరి మురళీకృష్ణరాజు వైసిపిలో చేరారు. గురువారం తాడేపల్లి వైసిపి ప్రధాన కార్యాలయంలో వైసిపి అధినేత వైఎస్. జగన్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజక వర్గంలో వైసిపిని మరింతగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆయనకు జగన్ సూచించారు. వైసిపి నేతలు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, విజయ సాయిరెడ్డి, మిథున్‌రెడ్డి వైవి.సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు ఆయనకు అభినందనలు తెలిపారు.

కుర్చీలు, టేబుల్స్ బహూకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం నిర్వహిస్తున్న మాతృత్వం అందిస్తున్న సేవా కార్యక్రమాలకు మద్దతుగా సాయి ఆటోమొబైల్స్ అధినేత పైడా సత్యరామకృష్ణ, పైడా సత్య గురువారం 20 కుర్చీలు,రెండు టేబుల్స్ బహూకరించారు. ఈ సందర్భంగా మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ మాట్లాడుతూ దాతల సహకారంతో గర్భిణులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తమనార లక్ష్మణ్ దివాకర్, వేముల శేఖర్, లక్ష్మి, రత్నం, సత్య ప్రశాంత్, జయశ్రీ పాల్గొన్నారు.

19 నుంచి రీ సర్వేపై గ్రామసభలు

ప్రజాశక్తి - కాజులూరు

రీ సర్వేలో ఉన్న ఇబ్బందులు తొలగించేందుకు ఈ నెల 19వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఎల్.శివకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రీ సర్వేలో ఏర్పడిన తప్పొప్పులను సరి చేసేందుకు శనివారం జగన్నాథగిరి సచివాలయం వద్ద మండల సర్వేయర్, ఆర్ఐ, విఆర్ఒ, గ్రామ సర్వేయర్ సహాయంతో గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని, రైతులు తమ ఇబ్బందులను ఈ గ్రామసభలో పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేట్లపాలెం, జి.మేడపాడు, హుస్సేన్‌పురం, మాధవపట్నం, వికె.రాయపురం, సత్యవరపుపేట, బోయినపూడి, ఉండూరు, గొంచాల, పి.వేమవరం, కాపవరం, నవర, చంద్రపాలెం, పవర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - కోటనందూరు

ఇసుక ఉచిత సరఫరా పాలసీకి సంబంధించి మండల పరిధిలో తాండవ నది నుంచి ఇసుకను ఎవరైనా వారి గృహ నిర్మాణ అవసరాలు నిమిత్తం ట్రాక్టర్, ఎడ్ల బండిలో ఉచితంగా తీసుకెళ్లవచ్చునని ఎస్ఐ టి.రామకృష్ణ అన్నారు..ఎవరైనా ఇసుక తోలుట కొరకు ఆటంకాలు కలిగించినా, అక్రమ ఆర్థిక వసూళ్లకు పాల్పడితే 9440900773కు ఫోను ద్వారా తెలియచేయాలన్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్టేషన్లలో ఎస్‌పి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కరప, కాజులూరు

కరప, గొల్లపాలెం పోలీస్‌స్టేషన్లలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, భవనాలు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కేసులను రికార్డుల్లో నమోదు చేయాలని, స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాద పూర్వకంగా మసులుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఎంపీ గీత పరామర్శ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఇటీవల కాలంలో మృతి చెందిన పలువురి బాధిత కుటుంబా లను మాజీ ఎంపీ వంగా గీత పరామర్శించారు. కొమరగిరికి చెందిన నరకుర్తి ప్రకాష్, సూర్యనారాయణమ్మ, రాజేశ్వరి, ఉప్పాడకు చెందిన ఎర్రి పిల్లి శివశంకర్, జొన్నలగురుకు చెందిన బర్రె నాగేశ్వరరావులు ఇటీవల కాలంలో మృతి చెందారు. దీంతో గురురవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుల చిత్రపటాలకు ఆమె పూలమాలవేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ పర్యటనలో వైసిపి మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కారే శ్రీనివాస్, ఉమ్మడి జాను, చెట్టుబత్తిన నాని, మెరుగు ఎల్లాజీ, బొంధు రాంబాబు, గింజాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ గీత

నేరాలు ఘోరాలు

14.5 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో ఎస్ఐ శివనాగు గురువారం సిబ్బందితో వాహనాలు తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలోనే మోటార్ సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు 14.5 కేజీల గంజాయిని తరలిస్తున్నట్లు ఈ తనిఖీల్లో గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. చిలకలూరిపేట కేతావత్ స్వామి నాయక్, మామిళ్ళపల్లి బాల గణేష్, ఒడిశా నుం చి చిలకలూరిపేటకు తరలిస్తుండగా వారిని అరెస్టు చేశారు.

రూ.లక్ష విలువైన నగలు చోరీ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం బొర్రంపాలెం గ్రామంలో సుమారు లక్ష రూపాయలు విలువ చేసే ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఎస్ఐ శివనాగు తెలిపిన వివరాల ప్రకారం..బొర్రంపాలెం గ్రామానికి చెందిన మంగిన వీర వెంకటేశ్వరరావు, తన కుటుంబంతో పాటు ఉపాధి నిమిత్తం హైదరాబాదులో ఉంటున్నారు. ఈనెల మొదటి వారంలో వచ్చి వికలాంగు పెన్షన్ తీసుకునేందుకు వచ్చి తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు గురువారం ఉదయం ఇంటి తలుపుల తాళాలు పగలగొట్టి ఉండటంతో స్థానికులు వెంకటేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంకటేశ్వరరావు బంధువు భేరి వీరలక్ష్మి వచ్చి చూడగా బీరువాలో లక్ష రూపాయల విలువ చేసే ఆభరణాలు, దేవుడి గదిలో రూ.20 వేలు చోరీకి గురయినట్లు గుర్తించారు. వీరలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

40 కాసుల బంగారు ఆభరణాల అపహరణ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడకు చెందిన చిటికెన సోమరాజు నివాసంలోని ఇంటి కబోర్డ్‌లో ఉంచిన 40 కాసుల బంగారు ఆభరణాలు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారని ఎస్ఐ ఎం.అశోక్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం ఆత్రేయపురం మండలంలోని బొబ్బర్లంకకు చెందిన జానా మారుతి శివరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన మామయ్య చిటికెన సోమరాజు జొన్నాడలో నివాసం ఉంటున్నారు. సోమరాజు భార్య అనారోగ్యం కారణంగా ఇంటికి తాళం వేసి గత కొంతకాలంగా హైదరాబాదులో వారు ఉంటున్నారు. ఎప్పటిలాగే పనిమనిషి గురువారం ఉదయం ఇల్లు శుభ్రం చేయుటకు వచ్చింది. ఇంటి డోర్ తీసి ఉండటం గమనించి వెంటనే విషయం తనకు తెలియపరచగా ఫిర్యాది వచ్చి చూసుకోంది. ఇంటి మెయిన్ డోర్ తలుపు పగలగొట్టి ఇంటిలోనికి ప్రవేశించి ఇంటి కబోర్డ్ లో ఉండవలసిన సుమారు 40 కాసుల బంగారాన్ని ఎవరో గుర్తుతెలియని దొంగలు ఆపహరించిపోయారని గుర్తించింది. ఈ మేరకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, సిఐ సిహెచ్.విద్యాసాగర్ కి సమాచారం అందజేయగా ఆయన ఘటన స్థలానికి వచ్చి పరిశీలించడం జరిగింది. అలాగే క్లూస్ టీం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వచ్చి నేరస్థలంలో ఫింగర్ ప్రింట్స్‌ను సేకరించారు. దోషులను గుర్తించేందుకు అని చర్యలు తీసుకుంటూ దర్యాప్తు చేస్తున్నాం.

గొర్రెలు మాయం కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - గోకవరం

సంత గొర్రెలు మాయం కావడంతో గోకవరం నిందితులను అరెస్టు చేశారు. రంగంపేట మండలం వడిశలేరు గ్రామానికి చెందిన తర్రా నాగేశ్వరరావు సెప్టెంబర్ 9న గోకవరం మార్కెట్‌కు తన 4 గొర్రెలను అమ్మడానికి తీసుకువెళ్లారు. గొర్రెలను మార్కెట్లో ఉంచి పక్కకు వెళ్లి తిరిగి వచ్చేసరికి మూడు గొర్రెలు కనబడలేదు. గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించి గోకవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పవన్ కుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు. గోకవరం డ్రైవర్స్ కాలనీకి చెందిన తెలగపాములకు చెందిన బండి పోసియా, పసుపులేటి దేవదాసు మూడు గొర్రెలను మార్కెట్ నుంచి అపహరించినట్టు గుర్తించారు. గొర్రెలను స్వాధీనం చేసుకుని వారిద్దరినీ రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

వేధింపులతో వివాహిత ఆత్మహత్య


ప్రజాశక్తి - రాజానగరం

ఇన్‌స్ట్రాగామ్‌లో పరిచయమైన వ్యక్తి బ్లాక్‌మెయిల్ చేయడంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజా నగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాతేరులో చోటు చేసకుంది. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన ఉల్లి ఉమా దేవి (32)కి సుమారు ఒక ఏడాది క్రితం విశాఖపట్నంకు చెందిన ఒక వ్యక్తితో ఇన్‌స్ట్రాగామ్‌లో పరిచయం ఏర్పడింది. అనంతరం ఆమె అతడికి బంగారు వస్తువులు ఇచ్చింది. అతడు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో అత్త వారింట్లో గొడవ జరిగింది. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లి చీరతో సీలింగ్‌కు బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. ఆమె ఏడాది చిన్నారి ఉంది. ఆమె తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మనోహర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - తాళ్లరేవు రూరల్

గోపులంక వద్ద గోదావరిలో గల్లంతైన శశి వేలు వెన్ను ఇంజనీరింగ్ విద్యార్థి కూతాని సాయి చంద్ర(21) మృతదేహం గురువారం రాత్రి లభ్యమైంది. స్థానిక మత్స్యకారులు గోదావరిలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినా రాత్రి వరకూ ఆచూకీ లభించలేదు. చివరి ప్రయత్నంగా స్థానిక మత్స్యకారులు గాలింపు చేపట్టడంతో ఘటనా స్థలం వద్దే మృతదేహం లభ్యమయింది. కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ, తహశీల్దార్ పి.త్రినాథరావు, విఆర్ఓ సుబ్రహ్మణ్యం మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



రోగులతో మాట్లాడుతున్న ఆర్ఎంఒ మునిస్వామి

ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి - యానాం రూరల్

స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిని ఆర్ఎంఒ మునిస్వామి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఒపిడి, ఫార్మసీ విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిడిటి.రవిశంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట



పమాణ స్వీకార సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు అందిస్తున్న సేవల వల్లే ఈ ఆసుపత్రికి ప్రజల్లో మంచిపేరు వచ్చిందన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు తోపాటు దాతల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ఆసుపత్రికి మౌలిక వసతుల ఏర్పాటు, యంత్ర సామగ్రి కొనుగోలు, ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా చిన్నరాజప్ప, మెంబర్ కన్వీనర్‌గా ఆసుపత్రి అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ పి.అమల, మెంబర్లుగా ఎంపి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, ఎం.దుర్గాకరుణ ప్రసాద్, డాక్టర్ డి.చంద్రశేఖర్, బొందల రామలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ఎంపిడిఒ కె.హిమమహేశ్వరి నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, కూటమి నాయకులు పిట్టా జానకిరామారావు, మంచెం సాయిబాబు, విత్తనాల వెంకటరమణ, అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు శ్రీనివాస్, కమీషనర్ ఎ.శ్రీవిద్య, ఎంపిడిఒ కె.హిమ మహేశ్వరి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పరిశ్రమలకు నోటీసులు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని నిబంధనలు పాటించని పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. గురువారం ఈ మేరకు కలెక్టరేట్ నుంచి ఓ ప్రకటనను విడుదల చేశారు. రసాయనాలు నిల్వ చేసే స్టోరేజ్ ట్యాంకుల వద్ద సెన్సార్లు, లెవెల్ ఇండికేటర్స్‌ను అక్టోబర్ 15వ తేదీలోగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 16వ తేదీ వరకు ఎన్‌స ఎస్ ఇండస్ట్రీస్, సాయి సమిత స్టోర్స్, మహితి స్టోర్స్, ఐఎంసి, తిరుమలేశా లాజిస్టిక్స్, అంగ్రీన్, కెబికె బయోటెక్ పరిశ్రమలు ఇప్పటివరకూ పరిశ్రమల్లో స్టోరేజ్ ట్యాంకర్ వద్ద సెన్సార్లు, లెవెల్ ఇండికేటర్లు ఏర్పాటు చేయని కారణంగా ఆయా యూనిట్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఏడు పరిశ్రమలకు నోటీసులు జారీ చేసి తగిన సంజాయిసీని తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

కృష్ణదేవరాయల వర్ధంతి

యానాం రూరల్: శ్రీ కృష్ణదేవరాయల వర్ధంతిని సమా చార శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎంఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆదిత్యలో 3 రోజుల వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కెఆర్‌కెవి ప్రసాద్

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్స్' అనే అంశంపై 3 రోజుల వర్క్‌షాప్ గురువారం ప్రారంభం అయింది. ఈ సదస్సుకు రిసోర్స్ పర్సన్స్‌గా జెఎన్‌టియుకె ప్రొఫెసర్ డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ కెఆర్‌కెవి.ప్రసాద్, పి.బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కెఆర్‌కెవి.ప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్తు మొత్తం ఎలక్ట్రిక్ వెహికల్స్ మీదనే ఆధారపడాల్సివుంటుందన్నారు. ప్రతీఒక్కరూ ఎలక్ట్రిక్ వెహికల్స్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ మాట్లాడారు. ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం.రవీంద్ర, అడ్మినిస్ట్రేషన్ డీన్ డాక్టర్ వైకెఎస్ఎస్. సుబ్బారావు, కెరీర్ గైడెన్స్ డీన్ డాక్టర్ డి.కిషోర్ పాల్గొన్నారు.

మారిన నవోదయ వెబ్‌సైట్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ఖాళీలు భర్తీ కోసం ప్రకటించిన నోటిఫికేషన్‌లో ఇచ్చిన వెబ్‌సైట్ అనివార్య కారణాల వల్ల పని చేయడం లేదని, అందువల్ల వెబ్‌సైట్‌ను మార్పు చేసినట్లు ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 8,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరంలో 9,11 తరగతుల్లో ప్రవేశానికి సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వటం జరిగిందన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు కొత్త వెబ్‌సైట్ ఏర్పాటు చేశామన్నారు. https://cbseitms.nic.in/2024/nvsix,https://cbseitms.nic.in/2024/nvsix_11/ వెబ్‌సైట్లు ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అథ్లెటిక్స్ పోటీలకు వేళంగి విద్యార్థులు

ప్రజాశక్తి - కరప

వేళంగి మెర్లాస్ జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల హెచ్ఎం బి.భారతి గురువారం తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి తూర్పుగోదావరి జిల్లాలో జరిగే అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారని ఆమె తెలిపారు. క్రీడాకారులు దుర్గాప్రసాద్ వీర మణికంఠస్వామి, రాంబాబు, మనీషా, అభిరామ్, భగవాన్, వీరేంద, ప్రవీణ్ జోష్ వీరదుర, సాయి రితిక, వరలక్ష్మి, లక్ష్మీ దీప్తి, సాయి సుధలను ఎస్ఎంసి ఛైర్మన్ మెర్ల వీరయ్యాచౌదరి, సిహెచ్.కృష్ణ, బోండా వెంకన్న రావు, సర్పంచ్ సవిలే నీలిమ అభినందించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

ప్రజాశక్తి - పెద్దాపురం, ఏలేశ్వరం

స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని ఘనంగా నివాళులర్పించారు. గురువారం జరిగిన ఈ కార్య క్రమంలో వాల్మీకి చిత్రపటానికి ఆర్‌డిఒ శ్రీరమణి, మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు వాల్మీకి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ డిఇఇ డిఎస్. ప్రకాశరావు, ఆర్ఓ చంద్రశేఖరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్య భాస్కరరావు, విడదాసరి రాజా, గోకేడ అప్పారావు, వాసంశెట్టి గంగ పాల్గొన్నారు. అలాగే ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో వాల్మీకి చిత్రపటానికి ఛైర్‌పర్సన్ అల మండ సత్యవతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అలమండ చలమయ్య, టిడిపి నాయకులు బోధ చిరంజీవి, కడింశెట్టి వాసు, బెల్లాని శ్రీను, కాకాడ నాగేశ్వరరావు, పెద్ద చలమయ్య, కమిషనర్ ఎం.సత్యనారాయణ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.